రామారావుమహారాజ్ తండాలో కూల్చిన ఇంటిని పరిశీలిస్తున్న లోకాయుక్త కమిటీ

ఇండ్ల కూల్చివేతలపై లోకాయుక్త కమిటీ విచారణ

పెద్దకొడప్‌గల్, ఆగస్టు 29: కామారెడ్డి జిల్లా పెద్దకొడప్‌గల్ మండలంలోని రామారావు మహారాజ్ తండాలో అటవీ అధికారులు ఇండ్లు కూల్చివేసిన ఘటనపై లోకాయుక్త కమిటీ గురువారం విచారణ చేపట్టింది. అటవీ భూముల్లో ఇండ్లను నిర్మించుకున్నారని మూడేండ్ల క్రితం అటవీ అధికారులు వాటిని కూల్చివేశారు. బాధితులు లోకాయుక్తను ఆశ్రయించగా, ఫిర్యాదును స్వీకరించి విచారణకు ఆదేశించింది. ఈ నేపథ్యంలో లోకాయుక్త కమిటీ సభ్యుడు మాథిక్ కోషి గురువారం రామారావు మహారాజ్ తండాకు వచ్చి విచారణ చేపట్టారు. బాన్సువాడ ఆర్డీవో నుంచి కూడా వివరాలు సేకరించారు.

హైడ్రా ముసుగులో వసూళ్లు!

- కూల్చివేతల్లో నిజాయితీ ఏది?
- బీజేపీఎల్పీ నేత ఏలేటి ఫైర్

హైదరాబాద్, ఆగస్టు 29 (నమస్తే తెలంగాణ): హైడ్రా ముసుగులో పెద్దఎత్తున బలవంతపు వసూళ్లకు పాల్పడుతున్నారని బీజేపీ శాసనసభాపక్షనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. ఈ విషయం తన దృష్టికి వచ్చినట్టు స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి కూడా మీడియా ముఖంగా చెప్పారని గుర్తుచేశారు. అక్రమ వసూళ్లకు పాల్పడుతుంటే ఇక హైడ్రా పారదర్శకత ఎక్కడ ఉన్నదని నిలదీశారు. అసెంబ్లీ మీడియా హాల్‌లో గురువారం ఆయన మాట్లాడుతూ.. చెరువుల ఆక్రమణలను కూల్చడాన్ని బీజేపీ స్వాగతిస్తున్నదని, అయితే ఆక్రమణలపై ప్రభుత్వం దూకుడు తగ్గించకుండా, నిష్పక్షపాతంగా వ్యవహరించాలని సూచించారు. పాతబస్తీ సల్కం చెరువు వద్ద జరుగుతున్న అక్రమ నిర్మాణాలను కూల్చే విషయంలో ప్రభుత్వం సమర్థంగా వ్యవహరించాలని కోరారు. సల్కం చెరువులో అక్రమంగా నిర్మించిన ఒవైసీ భవనాలకు ప్రత్యేక సమయం ఇవ్వడం వెనుక ఉన్న ఉద్దేశాలు ఏమిటి? అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎంఐఎంకు భయపడి పాతబస్తీ వైపు చూడటం లేదని ఆరోపించారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ తన అధికారిక హోదాను వదిలిపెట్టి, రాజకీయ నాయకుడిగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. 'మీరు కమిషనరా లేదా పొలిటికల్ లీడరా?' అని ప్రశ్నించారు.

అనుమతి ఇచ్చిన అధికారులపై కేసులు

ఆక్రమిత నిర్మాణాలకు సంబంధించి పోలీసులకు ఇరిగేషన్ శాఖ, హైడ్రా ఫిర్యాదు

హైదరాబాద్, ఆగస్టు 29 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ స్థలాలు, ఎఫ్‌టీఎల్‌లో కబ్జా చేసి నిర్మించిన వారితోపాటు సహకరించిన అధికారులపై హైడ్రా కేసులు పెడుతున్నది. ఈ నెల 20న బాచుపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఎర్రకుంట చెరువులో నిర్మాణాలు చేసిన మ్యాప్స్ ఇన్ మేనేజింగ్ డైరెక్టర్ సుధాకర్‌రెడ్డిపై ఇరిగేషన్ అధికారులు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. ఈ కట్టడాన్ని గతవారం హైడ్రా కూల్చేసింది. బిల్డర్ ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసి నిర్మించడానికి నిజాంపేట్ మున్సిపల్ కమిషనర్, బాచుపల్లి తహసీల్దార్, మేడ్చల్ ఏడీఈ, హెచ్ఎండీఏ ఏపీవోలను నిందితులుగా చేర్చాలంటూ గురువారం హైడ్రా ఫిర్యాదు చేసింది. మదీనాగూడలోని ఎర్ల చెరువులో నిర్మాణాలు చేశారంటూ చందానగర్‌లో ఇరిగేషన్ అధికారులు మరో కేసు నమోదు చేశారు. నిర్మాణాలు చేపట్టిన స్వర్ణలత, కృష్ణకిశోర్‌పై కేసు నమోదవగా, తాజాగా చందానగర్ డిప్యూటీ మున్సిపల్ కమిషనర్, టౌన్‌ప్లానింగ్ ఏసీపీలను ఆ కేసులో నిందితులుగా చేర్చాలంటూ సైబరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు హైడ్రా కమిషనర్ రంగనాథ్ వెల్లడించారు.

దివ్యాంగుల ఇండ్లపైకి బుల్డోజర్

మొదటిపేజీ తరువాయి...

అస్సలనుకోలేదు! ఎలాంటి నోటీసులు లేకుండా రాత్రికి రాత్రే బుల్డోజర్లతో దిగిన అధికారయంత్రాంగం తెల్లవారుజాము వరకు ఏకంగా 75ఇండ్లను కూల్చడంతో వందలాది మంది బతుకులు రోడ్డున పడ్డాయి. సీఎం రేవంత్‌రెడ్డి సొంత జిల్లాలో రెవెన్యూ అధికారులు రెచ్చిపోయారు. రాష్ట్ర రాజధానిలో హైడ్రా పేరిట జరుగుతున్న కూల్చివేతల పర్వాన్ని పాలమూరులోనూ ప్రత్యక్షంగా చూపించారు. మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలోని ఆదర్శనగర్‌లో 15 ఏండ్ల కిందట కాంగ్రెస్ హయాంలో పేదలకు ఇచ్చిన స్థలాల్లో కట్టుకున్న 75 ఇండ్లను ఎలాంటి నోటీసులు లేకుండా, ఆక్రమణలు అని తేల్చకుండా పోలీసు బందోబస్తు నడుమ నిశిరాత్రి నేలమట్టం చేశారు. బాధితులు నెత్తీనోరు బాదుకుంటూ కాళ్లావేళ్లా పడ్డా కనికరించలేదు. కూల్చినవాటిలో అంధులు, దివ్యాంగుల కుటుంబాలకు సంబంధించి 25 ఇండ్లు ఉన్నా దయ చూపలేదు. తెల్లవారుజామున 3 గంటలకు ప్రారంభమైన కూల్చివేతల పర్వం ఉదయం 6 గంటల వరకు ఏకధాటిగా సాగింది. తెల్లారేసరికే పేదల కలల సౌధాలు కండ్లముందే కూలిపోయాయి.

మహబూబ్‌నగర్‌లోని ఆదర్శనగర్ కాలనీలో అధికారులు కూల్చివేసిన నిర్మాణాలు

ఎవరి ఆదేశాల మేరకు వచ్చారో?

పాలమూరు కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలోనే ఆదర్శనగర్ ఉన్నది. ఎవరి ఆదేశాల మేరకు వచ్చారో తెలియదు కానీ రెవెన్యూ, పోలీసు సిబ్బంది హఠాత్తుగా బుధవారం అర్ధరాత్రి తర్వాత బుల్డోజర్లతో ప్రత్యక్షమయ్యారు. పడుకున్నవారిని లేపి

గురువారం తెల్లవారు జాము నుంచి కనిపించిన ఇంటినల్లా కూల్చేయడం మొదలుపెట్టారు. బాధితులు ఎవరూ దగ్గరికి రాకుండా పోలీసులను మోహరించారు. కొందరు శుభకార్యాల కోసం వివిధ ప్రాంతాలకు వెళ్లినవారంతా సమాచారం తెలిసి హుటాహుటిన పరిగెత్తుకొచ్చి కూలిన తమ ఇండ్లను చూసి లబోదిబోమన్నారు. మొండి గోడలను పట్టుకొని రోదించారు. మట్టిపెల్లల మధ్య మిగిలిన సామాన్లు తీసుకొని కట్టుబట్టలతో రోడ్డున పడ్డారు. ఓ కాంగ్రెస్ ప్రజాప్రతినిధి కనుసన్నల్లోనే ఇదంతా జరిగినట్టు తెలుస్తున్నది.

నాడు పట్టాలిచ్చి.. నేడు కూల్చి

మహబూబ్‌నగర్‌లోని 523 సర్వే నంబర్‌లో సుమారు 90 ఎకరాల వరకు ప్రభుత్వ భూమి ఉన్నది. ఇందులో 30 శాతం భూమిలో గత కేసీఆర్ ప్రభుత్వం పేదలకు డబుల్ బెడ్రూం ఇండ్లు నిర్మించి అందించింది. 15 ఏండ్ల కిందట సుమారు 2,000 మందికి పైగా ఇండ్లు లేని నిరుపేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇండ్ల పట్టాలు అందించింది. అప్పట్లో కంప చెట్లతో ఎగుడు దిగుడు స్థలాలు ఉండడంతో ఇండ్లు కట్టుకోలేక చాలా మంది ఖాళీగా ఉంచారు. కలెక్టర్ రొనాల్డ్‌రాస్ వచ్చాక చాలామంది అనర్హులున్నారని గుర్తించి కొందరి పట్టాలను రద్దుచేశారు. ఆ తర్వాత 500 మందిని అర్హులుగా ప్రకటించి మళ్లీ పట్టాలు ఇచ్చారు. ఇదేఅదనుగా రెవెన్యూ సిబ్బంది సహకారంతో కొందరు దళారులు పెద్ద ఎత్తున ఆదర్శనగర్‌లో పట్టాలు సృష్టించి స్థలాలు విక్రయించారు. రూ.లక్షలు పెట్టి పేదలు కొనుగోలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన పట్టాలను బీఆర్ఎస్ సర్కారు కొనసాగించింది. ఎలాంటి చర్యలు తీసుకోకుండా నివాసయోగ్యం కల్పించింది. మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే పేదల ఇండ్లపై ప్రతాపం చూపింది.

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే : తహసీల్దార్

పట్టణంలో సర్వే నంబర్ 523లోని మూడెకరాల్లో అక్రమ నిర్మాణాలు ఉన్నట్టు తేల్చామని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే తొలగించామని అర్బన్ తహసీల్దార్ ఘన్సీరాం వెల్లడించారు. స్థానిక కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఎవరి ఆదేశాల మేరకు ఇదంతా జరిగిందని అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పకుండా దాటవేశారు.

కలెక్టరేట్ ఎదుట బాధితుల ఆందోళన

ఆదర్శనగర్‌లో తమ ఇండ్లను కూల్చివేయడంతో బాధితులంతా కలెక్టరేట్ ఎదుట ఆందోళనకు దిగారు. కనీసం నోటీసులు ఇవ్వకుండా, ఎలాంటి సమాచారం లేకుండా తమ ఇండ్లను కూల్చివేశారని మండిపడ్డారు. తిరిగి ఇండ్లు నిర్మించి ఇవ్వాలని, నష్టపరిహారం కింద రూ.5 లక్షలు ఇవ్వాలని, కూల్చివేతకు పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

'కాంగ్రెస్ వస్తే మార్పు వస్తుందని ఓట్లేసినం.. చివరికి ఆ ప్రభుత్వం చేసిన ఘన కార్యమిది' అంటూ కన్నీరుపెట్టారు. బాధితులెవరినీ అధికారులను కలవనీయకుండా పోలీసులు కట్టడి చేయడంతో చేసేది లేక బాధితులంతా వెనుదిరిగారు.

అంధులు, దివ్యాంగుల ఇండ్లనూ కూల్చిన సర్కార్

ఇండ్లు నేలమట్టమైన బాధితుల్లో మరుగుజ్జులు, దివ్యాంగులు, చివరికి అంధులు కూడా ఉన్నారు. వీరికి చెందిన 25 ఇండ్లను కూడా అధికారులు కూలగొట్టరు. 'గత ప్రభుత్వం ప్లాట్లుగా ఇచ్చిన భూముల్లోనే మా రక్తాన్ని చెమటగా ధారబోసి కట్టుకున్న ఇండ్లను ఒక్క రాత్రిలో కూలగొట్టింద్రు' అంటూ వారు కుమిలిపోతున్నారు. తమ దగ్గర ప్రభుత్వం ఇచ్చిన పట్టాలు ఉన్నాయని వాటిని చూపిస్తూ ఆందోళన చేశారు. మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పరిశీలనకు రాగా ఆయన ఎదుట ఒక్కో బాధితుడు వచ్చి తమ గోడును వెల్లగక్కారు.

దివ్యాంగులు, పేదలన్న కనికరం లేదా? : మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

'దివ్యాంగులు, అంధులు అని కూడా చూడకుండా వారి ఇండ్లను కూలగొట్టారు. ఇండ్లు కూల్చితే పేదలు ఎక్కడ ఉండాలె అన్న ఆలోచన కూడా చేయకపోవడం దారుణం' అని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆవేదన వ్యక్తంచేశారు. గురువారం సాయంత్రం ఆదర్శనగర్‌లో కూలిన ఇండ్లను ఆయన పరిశీలించారు. విచారణ జరపకుండా, ఎలాంటి నోటీసులివ్వకుండా కూల్చివేయడం ఎంతవరకు సమంజసమని మండిపడ్డారు. బాధితులకు కూల్చిన చోటే ఇండ్లు నిర్మించి ఇవ్వాలని, ఈ వ్యవహారంపై విచారణ జరిపి సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధితులతో మాట్లాడి అండగా ఉంటామని భరోసానిచ్చారు. రోడ్డునపడ్డ పేదలకు వసతి, భోజన సదుపాయం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఒకవేళ దొంగ పట్టాలుంటే వీళ్లకు పట్టాలిచ్చిన వారిపై కేసులు పెట్టాలని, పేదలకు అన్యాయం చేయడం తగదని చెప్పారు.

కాంగ్రెస్‌ను నమ్మితే ఇంటినే కూల్చింది

నా భర్త కాంగ్రెస్ మనిషి.. మా కాంగ్రెస్ అనుకుంట ఆ పార్టీలో తిరుగుతడు. ఇప్పుడు ఆ కాంగ్రెస్ పార్టే మాకు ఉండనీకి గూడు లేకుండజేసింది. నా కుడికాలు విరగడంతో రాడ్డు వేసింద్రు. ఇబ్బంది అయితే నిన్న దవాఖానకు పోయిన. డాక్టర్లు పరీక్షలు చేసింద్రు. టెస్టులు వచ్చాక ఏం చెప్తరో అని అక్కన్నే ఉన్న. పక్క ఇంటోల్లు ఫోన్ చేసి మీ ఇల్లు కూలగ్గొట్టింద్రు అని చెప్పంగనే గుండెల బండ వడ్డట్టయ్యింది. ఇక్కడికి వచ్చి చూసినంక దుఃఖం ఆగలే. ఎంత ఏడిస్తే ఏం లాభం. మొండి గోడలు మిగిలియన్. కడుపుమాడ్చుకొని కట్టుకున్న ఇంటిని కూలగొట్టింద్రు.. వీళ్ల శేతులకు జెట్టలువుట్ట.

- ఉప్పరి లలిత, బాధితురాలు, ఆదర్శనగర్, మహబూబ్‌నగర్

హైడ్రాకు మరిన్ని అధికారాలు

- ఓఆర్ఆర్ పరిధిలోని అన్ని చెరువులు, పార్కులు, నాలాలు, ప్రభుత్వ స్థలాల పరిరక్షణ బాధ్యతలు
- హైడ్రా నుంచే అన్ని రకాల ఆక్రమణలకు నోటీసులు : సీఎస్

హైదరాబాద్, ఆగస్టు 29(నమస్తే తెలంగాణ): ఆక్రమణల తొలగింపునకు సంబంధించి హైడ్రాకు మరిన్ని అధికారాలు అప్పగించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తున్నదని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి తెలిపారు. ఓఆర్ఆర్ పరిధిలోని చెరువులు, పార్కులు, నాలాలు, ప్రభుత్వ స్థలాలు, వివిధ శాఖల కింద ఉన్న ఆక్రమణ స్థలాల పరిరక్షణకు నోటీసులు ఇచ్చే అధికారాన్ని హైడ్రాకు ఇవ్వనున్నట్టు వెల్లడించారు. చెరువుల ఆక్రమణల తొలగింపు, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణపై రాష్ట్ర హైకోర్టు జారీ చేసిన ఆదేశాలను పరిగణనలోకి తీసుకుంటూ సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించేందుకు సీఎస్ గురువారం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడారు. చెరువులు, కుంటలు, పార్కులు, ప్రభుత్వ స్థలాల ఆక్రమణల తొలగింపుపై ప్రస్తుతం నీటిపారుదల, జీహెచ్ఎంసీ, పురపాలక, పంచాయితీరాజ్, వాల్టా తదితర విభాగాలు వేర్వేరుగా నోటీసులు జారీ చేయడంతో గందరగోళం ఏర్పడుతున్నదని అభిప్రాయపడ్డారు. దీనిని నివారించడానికి ఓఆర్ఆర్ పరిధిలో అన్నిరకాల ఆక్రమణల తొలగింపు నోటీసులను హైడ్రా ద్వారానే చేపట్టేందుకు విధి విధానాలు ఖరారు చేయాలని మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శిని ఆదేశించారు. జీహెచ్ఎంసీ, ల్యాండ్ ఎన్‌క్రోచ్‌మెంట్, ల్యాండ్ గ్రాబింగ్, వాల్టా, నీటి పారుదల శాఖ చట్టాల ద్వారా జారీ చేసే అన్ని రకాల నోటీసులు, తొలగింపులను హైడ్రా పరిధిలోకి తెస్తామని వివరించారు. గండిపేట, హిమాయత్‌సాగర్ చెరువుల పరిరక్షణ జలమండలి నుంచి హైడ్రా పరిధిలోకి తెస్తామని వెల్లడించారు. హైడ్రా ఆధ్వర్యంలో మొత్తం 72 బృందాలు ఏర్పాటయ్యాయని, వీటిని మరింత బలోపేతం చేయడానికి కావాల్సిన పోలీస్, సర్వే, నీటిపారుదల శాఖల నుంచి అధికారులు, సిబ్బందిని త్వరితగతిన కేటాయిస్తామని తెలిపారు.

పేదలకు 7 రోజులు.. పెద్దలకు 30 రోజులు!

అది రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలంలోని దుర్గం చెరువు ప్రాంతం.. చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలో అక్రమ కట్టడాలను గుర్తించిన రెవెన్యూ అధికారులు దాదాపు 200కు పైగా నోటీసులు జారీ చేశారు. మాదాపూర్‌లోని అమర్ కో-ఆపరేటివ్ సొసైటీలో ఉంటున్న ముఖ్యమంత్రి సోదరుడు తిరుపతిరెడ్డితోపాటు కావూరిహిల్స్, నెక్టర్స్‌కాలనీ, డాక్టర్స్‌కాలనీ, అమర్‌సొసైటీ వాసులకు నెల రోజుల వ్యవధితో నోటీసులు జారీ చేశారు. నెలలోపు అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తామని సదరు నోటీసులో పేర్కొన్నారు.

అది మేడ్చల్ మాల్కాజిగిరి జిల్లా ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లో బోయిన్ చెరువు. 40 ఏండ్ల పైబడి కూలీ పనిచేసుకుంటున్న దాదాపు 120 కుటుంబాలకు బాలానగర్ రెవెన్యూ అధికారులు నోటీసులు జారీ చేశారు. చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో ఉన్నదని, ఏడు రోజుల వ్యవధితో ఆక్రమణలను కూల్చివేస్తామని నోటీసుల్లో పేర్కొన్నారు.

- కూల్చివేతలు, నోటీసుల జారీలో ద్వంద్వ వైఖరి
- కొనసాగుతున్న ప్రభుత్వ 'హైడ్రా'మా

హైదరాబాద్ సిటీబ్యూరో, ఆగస్టు 29 (నమస్తే తెలంగాణ): ఈ రెండు ఉదంతాలను పరిశీలిస్తే, హైడ్రా పేరుతో ప్రభుత్వం ఎలా ద్వంద్వ వైఖరి అవలంబిస్తున్నదో అర్థమవుతుంది. కొన్ని రోజులుగా హైడ్రా రోజుకో రీతిలో స్వరం మారుస్తూ, ఆక్రమణల కూల్చివేతల్లో ద్వంద్వ విధానాలను అమలు చేస్తున్నది. సామాన్య ప్రజల నుంచి బడా నేతలు, సెలబ్రెటీలకు చెందిన అక్రమ కట్టడాల కూల్చివేతలో తన, మన అనే తేడా లేకుండా ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలి. కానీ, పేదోళ్ల గూడుపైనే అత్యధికంగా బుల్డోజర్ల దాడులు జరుగుతున్నాయి. ఆక్రమణలపై నోటీసుల జారీలోనూ ద్వంద్వ విధానాలు అమలు చేస్తున్నది. పేదోళ్లకు ఏడు రోజులు, పెద్దలకు 30 రోజులు సమయం ఇస్తూ వ్యత్యాసం చూపుతున్నది. ఇందుకు బోయిన్‌పల్లి బోయిన్‌చెరువు, దుర్గంచెరువు పరిధిలో ఉన్న నోటీసులు అందుకున్న వారే సాక్ష్యం.

హైడ్రా అడుగులన్నీ అనుమానాస్పదమే

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ప్రభుత్వ ఆస్తులు, చెరువులు, కుంటలు, నాలాల పరిరక్షణే ధ్యేయంగా ఏర్పాటైన హైడ్రా.. ఏకపక్షంగా వ్యవహరిస్తున్నదనే విమర్శలను ఎదుర్కొంటున్నది. ఇప్పటికే నందగిరిహిల్స్ లేఅవుట్ విషయంలో పేదల బస్తీలపై ప్రతాపం చూపడంతో కాంగ్రెస్ పార్టీ పంచన చేరిన స్థానిక ఎమ్మెల్యే దానం నాగేందర్ హైడ్రా కమిషనర్ రంగనాథ్‌పై సీఎంకు ఫిర్యాదు చేశారు. ఇటీవల శేరిలింగంపల్లి మండలంలోని రాయదుర్గం 1 నుంచి 41 వరకు ఉన్న సర్వే నంబర్లలో 37.08 ఎకరాల భూమి విషయంలో జరిపిన కూల్చివేతల్లో ఐదు కుటుంబాలను రోడ్డుపాలు చేశారు. తాజాగా బోయిన్‌పల్లి డివిజన్‌లోని పేదలపై ప్రతాపం చూపేందుకు రంగం సిద్ధంచేయడంతో బాధితులు హైడ్రాపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. నలభై ఏండ్లుగా ఇక్కడ కూలి పని చేసుకుంటూ జీవిస్తున్నామని, గడిచిన నాలుగు రోజులుగా రెవెన్యూ విభాగం అధికారులు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ పరిధి అంటూ నోటీసులు ఇస్తున్నారని స్థానికులు వాపోయారు. 1980 నుంచి ఇండ్లు కట్టుకొని ఉంటున్నామని చెప్తున్నారు.

దుర్గం చెరువు బఫర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడి ఇల్లు

నోటీసుల జారీలో సమన్వయం ఏదీ?

ఓఆర్ఆర్ పరిధిలోని అన్ని చెరువులు, పార్కులు, నాలాలతోపాటు అన్ని ప్రభుత్వ స్థలాల పరిరక్షణ బాధ్యతలను హైడ్రాకు ప్రభుత్వం అప్పగించింది. అయితే, ఇప్పటి వరకు ఆక్రమార్కులకు హైడ్రా నోటీసులు జారీ చేయడం లేదు. నీటిపారుదల శాఖ, జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, రెవెన్యూ శాఖలు ఎవరికి వారే అన్నట్టుగా నోటీసులు జారీ చేస్తున్నారు. ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్, నాలా ఆక్రమణ, వాల్టా చట్టం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని ఆయా శాఖలు వేర్వురుగా నోటీసులు జారీ చేస్తున్నాయి. దీంతో ఈ వ్యవహారం గందరగోళంగా మారుతున్నది.

సమయం ఇవ్వండి.. సామాన్లు సర్దుకుంటాం: సీఎం సోదరుడు

దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో తన ఇల్లు ఉన్నదంటూ శేరిలింగంపల్లి రెవిన్యూ అధికారులు నోటీసులు జారీ చేశారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరుడు తిరుపతిరెడ్డి తెలిపారు. 2016-17లో అమర్‌సొసైటీలో నివాసం భవనం కొనుగోలు చేశానని, ఆ సమయంలో ఈ భవనం ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నట్టు తనకు ఎటువంటి సమాచారం లేదని చెప్పారు. తన ఇల్లు అక్రమంగా ఉంటే కూల్చివేయాలని, అందుకు తనకు కొంత సమయం ఇస్తే ఇంటిలోని ఫర్నీచర్ సహా ఇతర వస్తువులను తీసుకుని బయటకు వెళ్తానని పేర్కొన్నారు. ఈ లే అవుట్‌కు 1995లో అనుమతి ఇచ్చారని, తనపై కొందరు కావాలనే రాజకీయం చేస్తున్నారని వ్యాఖ్యానించారు.

హైడ్రా కమిషనర్‌ను కలిసిన ఎంపీ అనిల్

25 లక్షల ఎంపీ నిధుల కేటాయింపు

హైదరాబాద్ సిటీబ్యూరో, ఆగస్టు 29 (నమస్తే తెలంగాణ) : హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌ను గురువారం బుద్ధభవన్‌లోని ఆయన కార్యాలయంలో ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్‌ను కలిశారు. హైడ్రా పనితీరుపై హర్షం వ్యక్తం చేస్తూ ఎంపీ లాడ్స్ నుంచి రూ. 25 లక్షలు కేటాయిస్తూ కమిషనర్‌కు లేఖను అందజేశారు. హైడ్రాకు పూర్తి మద్దతు ఇస్తున్నామని ఎంపీ చెప్పారు. హైడ్రాను ఇతర జిల్లాల్లో కూడా అమలు చేయాలని ప్రభుత్వానికి వినతులు అందుతున్నాయని, ఆ మేరకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

హైడ్రా పేరుతో అవినీతికి పాల్పడితే చర్యలు

- అధికారులకు సీఎం హెచ్చరిక
- కూల్చివేతల బెదిరింపులపై ఫిర్యాదుల వెల్లువ

హైదరాబాద్, ఆగస్టు 29(నమస్తే తెలంగాణ): హైడ్రా పేరుతో అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. హైదరాబాద్‌లో హైడ్రా పేరు చెప్పి భయపెట్టి, బెదిరించి కొందరు కిందిస్థాయి అధికారులు అవినీతికి పాల్పడుతున్నారంటూ వచ్చిన ఫిర్యాదులపై సీఎం స్పందించారు. గతంలో ఇచ్చిన నోటీసులు, రెండు మూడేండ్ల కిందటి ఫిర్యాదులను అడ్డంగా పెట్టుకొని కొన్నిచోట్ల రెవిన్యూ, మున్సిపల్, ఇరిగేషన్ అధికారులు డబ్బులు డిమాండ్ చేస్తున్నట్టు తన దృష్టికి వచ్చిందని చెప్పారు. ఇలాంటివాటికి పాల్పడేవారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. హైడ్రా పేరుతో వసూళ్లకు పాల్పడుతున్న అధికారులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఏసీబీ, విజిలెన్స్ అధికారులను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. అనంతరం గణేశ్ ఉత్సవాల నిర్వహణపై సచివాలయంలో రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. సమావేశానికి పలువురు మంత్రులు, సీఎస్, పోలీస్ శాఖ ఉన్నతాధికారులు, గణేశ్ ఉత్సవ సమితి ప్రతినిధులు హాజరయ్యారు.

హైడ్రాను రాష్ట్రమంతా అమలు చేస్తాం

- చెరువుల పరిరక్షణ కోసమే హైడ్రా ప్రయత్నం
- మంత్రి పొన్నం ప్రభాకర్



కరీంనగర్, ఆగస్టు 29 (నమస్తే తెలంగాణ): హైడ్రాను రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేసే ఆలోచనలో ఉన్నామని బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. గురువారం కరీంనగర్‌లోని క్రీడా పాఠశాలలో జరిగిన జాతీయ క్రీడా దినోత్సవంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. హైడ్రా ఏర్పడక ముందే కరీంనగర్‌లో భూ ఆక్రమణదారులు, చెరువుల కబ్జాలపై చర్యలు తీసుకునేందుకు జిల్లా యంత్రాంగానికి పూర్తిగా స్వేచ్ఛనిచ్చామని, అన్ని రకాల చర్యలు తీసుకునే విధంగా అధికారులకు ధైర్యాన్ని ఇచ్చామని తెలిపారు. హైదరాబాద్ అయినా, ఏ జిల్లా యంత్రాంగమైనా ప్రభుత్వ ఉద్దేశం స్పష్టంగా ఉందని చెప్పారు. కరీంనగర్ పరిసరాల్లోని స్థలాల్లో ఆక్రమణలు జరుగుతున్నాయని, ఆధారాలుంటే.. ఆర్‌టీఐ ద్వారా సమాచారం ఇస్తే త్వరగా పరిష్కరించే ప్రయత్నం చేస్తామని చెప్పారు. ప్రభుత్వం ఏ స్థలాల మీద ఆంక్షలు విధించదని, కేవలం చెరువుల పరిరక్షణ కోసమే ప్రయత్నిస్తుందని వివరించారు.

విపత్తు నిర్వహణ వ్యవస్థ బలోపేతం

మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



హైదరాబాద్, ఆగస్టు 29(నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో విపత్తుల నిర్వహణ వ్యవస్థను బలోపేతం చేస్తున్నట్టు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. గురువారం సచివాలయంలో వరద కార్యాచరణ ప్రణాళికపై మంత్రి సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో వరదలపై సంబంధిత శాఖలు కార్యాచరణ ప్రణాళికలు రూపొందించుకోవాలని ఆదేశించారు. రాష్ట్ర స్థాయిలో డిజాస్టర్ మేనేజ్‌మెంట్ తరపున టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేయాలని చెప్పారు. ఎటువంటి విపత్కర పరిస్థితి ఎదురైనా అధిగమించడానికి వీలుగా అధునాతన పరికరాలను సిద్ధం చేసుకోవాలని కోరారు. డిజాస్టర్ మేనేజ్‌మెంట్ బలోపేతానికి తీసుకుంటున్న చర్యలను హైడ్రా కమిషనర్ రంగనాథ్ వివరించారు. గతంలో 30 బృందాలు ఉండగా దాన్ని 70కి పెంచామని, సిబ్బంది సంఖ్యను 1,800 నుంచి 3,500 వరకు పెంచినట్టు వివరించారు. హైడ్రాకు డిజాస్టర్ మేనేజ్‌మెంట్ పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని, అందుకు అవసరమైన ప్రతిపాదనలను పంపించాలని హైడ్రా కమిషనర్‌కు సూచించారు. ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్‌కుమార్, రెవెన్యూ శాఖ సంయుక్త కార్యదర్శి పాల్గొన్నారు.

ఇరిగేషన్ విభాగం గురువారం నోటీసులు జారీ చేసిన దుర్గంచెరువు సమీపంలోని అమర్‌సొసైటీ పరిధిలోని ఇండ్లు

కూల్చివేత కాదు.. షోకాజ్ నోటీసులు

- ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు
- దుర్గంచెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మాణాల కూల్చివేతల నోటీసులపై పిటిషన్లు

హైదరాబాద్, ఆగస్టు 29 (నమస్తే తెలంగాణ): రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం గుట్టలబేగం ప్రాంతంలో దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్ ఏరియాలో నిర్మాణాల తొలగింపునకు ఇచ్చిన నోటీసులను షోకాజ్ నోటీసులుగా పరిగణించాలని హైకోర్టు ప్రభుత్వానికి ఉత్తర్వులు జారీ చేసింది. షోకాజ్ నోటీసులకు పిటిషనర్లు తమ వద్ద ఉన్న వివరాల ఆధారాలను సంబంధిత అధికారులకు చూపించాలని తెలిపింది. ఆధారాలను పరిశీలించాకే చర్యలు తీసుకోవాలని తెలిపింది. శేరిలింగంపల్లి మండలం గుట్టబేగంపేటలో 58.08 ఎకరాల్లో 280 ప్లాట్లతో వేసిన లేఔట్లలోని స్థలాలను కొనుగోలు చేసి 1998లో ఇండ్లు నిర్మించుకున్నవాళ్లను తొలగించేందుకు వాల్టా చట్టంలోని సెక్షన్-23 కింద డిప్యూటీ కలెక్టర్, తహసీల్దార్ నోటీసులు జారీచేశారు. వీటిని సవాలు చేస్తూ పలు వ్యాజ్యాలు దాఖలయ్యాయి. వాటిపై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే శ్రీనివాసరావు ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. పిటిషనర్ల న్యాయవాదులు వాదిస్తూ.. 1998లో వేసిన లేఔట్‌లోని ప్లాట్లలో ప్రభుత్వ శాఖల అనుమతులతో ఇండ్లను నిర్మించుకున్నారని వివరించారు. నోటీసు ఇవ్వకుండా, వివరణ కోరకుండానే ఇండ్లు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నాయని, వాటిని తొలగించేస్తామని నోటీసులు ఇచ్చారని తెలిపారు. కావూరిహిల్స్‌లోని అపార్టుమెంట్లు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నాయని చెప్తున్నారని, వాటిని తొలగించాలంటూ ఈ నెల 3న నోటీసులు ఇచ్చారని వెల్లడించారు. ప్రభుత్వం తరపున అడ్వొకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి స్పందిస్తూ.. ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మాణాలను తొలగించాలంటూ డిప్యూటీ కలెక్టర్, తహసీల్దార్ ఇచ్చిన నోటీసులను షోకాజ్‌లుగా పరిగణిస్తామని, గడువులోగా పిటిషనర్ల వివరణ తీసుకుంటామని చెప్పారు. ఇందుకు హైకోర్టు అనుమతి ఇస్తూ విచారణను ముగిస్తున్నట్టు ప్రకటించింది.

సీఎం సోదరుడి ఇంటి వద్ద మరో మహిళా జర్నలిస్టుపై దౌర్జన్యం

హైదరాబాద్, ఆగస్టు 29 (నమస్తే తెలంగాణ): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోదరుడు తిరుపతిరెడ్డి ఇంటికి రెవెన్యూ శాఖ నోటీసులు జారీచేసేందుకు వెళ్లిన సమయంలో కవరేజీకి వెళ్లిన ఓ మహిళా జర్నలిస్టుపై ఆయన అనుచరులు దౌర్జన్యానికి పాల్పడ్డారు. ఇటీవల సీఎం సొంత గ్రామం కొండారెడ్డిపల్లిలో ఇద్దరు మహిళా జర్నలిస్టులపై కాంగ్రెస్ కార్యకర్తల దాడి ఘటన మరువకముందే సీఎం సోదరుడి ఇంటివద్ద అలాంటి ఘటనే ఎదురైంది. మీడియా కవరేజీకి వచ్చిన ఓ మహిళా జర్నలిస్టును అడ్డుకోవడంతోపాటు, ఆమె కెమెరాను లాక్కోవడానికి తిరుపతిరెడ్డి అనుచరులు ప్రయత్నించడం వివాదాస్పదమైంది. కాగా విధి నిర్వహణలో ఉన్న జర్నలిస్టులను అడ్డుకోవడం, మీడియాపై దాడి చేయడం కాంగ్రెస్ పాలనలో నిత్యకృత్యమైందని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. ప్రజాపాలన అని ప్రచారం చేసుకుంటూ, మీడియా స్వేచ్ఛను హరించడం సిగ్గుచేటని, మీడియా పై జరుగుతున్న వరుస దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామని ఎక్స్ వేదికగా తెలిపారు.